Go for this
- రాజకీయ రౌండప్‌లు
- వ్యాసాలు
- సంగ్రహ వార్తలు
- విశ్లేషణలు



## 'సేవ్ సింగరేణి' తెలంగాణకు ఎంతో అవసరం

కె. బాలగోపాల్

తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనులు కార్మిక ఆందోళనలకు ఎప్పటినుండో పేరు పొంది ఉన్నాయిగానీ, ఆ సంస్థ ఛైర్మన్ పట్ల కార్మికులలో ఇప్పుడున్నంత ఏకగ్రీవమైన వ్యతిరేకత గతంలో ఎప్పుడూ లేదేమో. ఈ ఛైర్మన్ శర్మగారు చంద్రబాబు నమూనా మనిషి. సంస్థ పనితనానికి ప్రమాణం సంవత్సరం చివర చూపించే లాభాల రేటు. అది ఎంత ఎక్కువ ఉంటే సంస్థ యాజమాన్యం అంతటి సామర్థ్యాన్ని ప్రదర్శించినట్టు.

లాభాలకు ప్రధాన అవరోధం కార్మికుల జీతభత్యాలు అన్నది ఈ రోజు పారిశ్రామిక రంగంలో -ప్రైవేట్, పబ్లిక్ అన్నతేడా లేకుండ-సార్వత్రికంగా ఉన్నఅభిప్రాయం కాబట్టి కార్మికుల సంఖ్యను వీలయిన మేరకు తగ్గించి, ఉన్న కార్మికుల పనిభారాన్ని పెంచి, రెగ్యులర్ కార్మికుల స్థానంలో క్యాజువల్ లేక కాంట్రాక్టు కార్మికులను పెట్టుకొని పనిచేయించుకోడం కార్యదక్షతగల యాజమాన్యం లక్షణం అనిఇప్పుడు అందరూ అనుకుంటున్నారు.

ఈ ఎత్తుగడను అమలు చేయడానికి సింగరేణిలో ఒక సమస్య ఉంది. ఒక కార్మికుడు అనారోగ్యం వల్లనైనా వయసు మీరడం వల్లనయినా రిటైర్ అయితే అతని కొడుకుకో అల్లునికో వేరొక దగ్గరి బంధువుకో ఉద్యోగం ఇవ్వాలని యూనియన్లతో చేసుకున్న ఒప్పందం చాలా కాలంగా అమలులో ఉంది. అటువంటప్పుడు కార్మికులను తొలగించడం ద్వారా కార్మికులసంఖ్యను తగ్గించడం కష్టం. దీనికి ఛైర్మన్ శర్మగారు కనిపెట్టిన పద్ధతేమిటంటే కార్మికులు సగౌరవంగా బయటకు పోయేదాకా ఆగకుండ డిస్మిస్ చేయడం. బొగ్గుగనులలో డ్యూటీ ఎగవేత ఇతర పరిశ్రమల కంటె ఎక్కువగా ఉంటుంది కాబట్టి దానిని అడ్డంపెట్టుకొని డిస్మిస్ చేస్తే అతని కొడుకుకో అల్లుడికో ఉద్యోగం ఇవ్వనక్కరలేదు.

ఛైర్మన్ శర్మగారి హయాంలో ఈ విధంగా కొన్ని వేల మంది డిస్మిస్ చేయబడ్డారు. బొగ్గు తవ్వకం చాలా ప్రయాసతో కూడిన పని కాబట్టి ఎగవేతలు అగవు, ఈ ఎత్తుగడకు ఢోకా లేదు.

అట్లాగని ఛైర్మన్ శర్మగారు యూనియన్లతో చేసుకున్న ఒప్పందాలన్నిటినీ గౌరవిస్తారని కాదు. కొన్నిటిని అతిక్రమించడానికి అడ్డదార్లు వెతుక్కుంటేకొన్నిటిని నేరుగానే అతిక్రమిస్తారు. చట్టబద్ధంగా చేసుకున్న ఒప్పందాలను అతిక్రమించడం ఐడి చట్టం కింద నేరం. అయినా 'గతంలో చేసుకున్న ఒప్పందాన్ని ఇక మీదట అమలు చేయము' అని ఛైర్మన్ శర్మగారు సర్క్యులర్‌లు జారీ చేస్తున్నారు.

ఒక పర్యా చట్టం కళ్లలో నేరమైనంత మాత్రాన సరిపోదు. దానికి పాల్పడితే శిక్షించే వాళ్లుండాలి. సింగరేణి ఛైర్మన్‌ను శిక్షించే సాహసం కార్మిక శాఖ చేయదు కాబట్టి అతనికి ఈ నేరం చేయకుండ ఉండవలసిన అవసరం లేదు.

తీసేసిన కార్మికులు పోగా మిగిలిన వారి చేతనే ఆ పనంతా చేయించడం ఈ ఎత్తుగడలో రెండవ మెట్టు. ఆరుగురు చేసిన పనిని నలుగురి చేత చేయిస్తే 'వేజ్‌బిల్లు' 33 శాతం తగ్గుతుంది. లాభాలు చూపించడానికి ఇంతకంటే మంచి మార్గమేముంది.

ఆరుగురు చేసే పనిని నలుగురి చేత చేయించడానికి పని గంటలు కూడా పెంచనక్కరలేదు. 'ఎనిమిది గంటల డ్యూటీ అంటే అర్థం ఎనిమిది గంటలలో ప్రతీ నిముషం పని చేయడం' అనే కొత్త నిర్వచనం ఛైర్మన్ శర్మగారు ఇచ్చారు. బొగ్గు తవ్వి టబ్బులో నింపే కార్మికుడు మళ్లీ టబ్బు వెనక్కి వచ్చేంత వరకు ఊరికే ఉండకూడదు. తవ్వకానికి అనుబంధంగా జరిగే వేరే పని ఏదయినా చేపట్టాలి. ఉదాహరణకు పేలుడు పదార్థాలను గనిగోడలలో అమర్చుకోవడం. ఇప్పటి దాకా ఈ పని చేస్తున్న కార్మికులను అక్కడి నుండి తొలగించి వేరే పనిలోనో కొత్త గనులలోనో పెట్టవచ్చు.

కొత్తగా వచ్చిన గనుల కోసం కొత్త కార్మికులను తీసుకోకుండ, పై పద్ధతులలో 'సర్ప్లస్' చేయబడిన కార్మికులను బదిలీ చేయడం,లేదా ఓపెన్ కాస్ట్ పద్ధతిని అనుసరించడం ద్వారా ఎక్కువ మంది కార్మికులను తీసుకోవలసిన అవసరమే లేకుండా చేయడం,సంప్రదాయపద్ధతినే అనుసరించినా బొగ్గు తవ్వకమొక్కటి మినహాయించి మిగిలిన పనులన్నీ కాంట్రాక్ట్‌కు ఇవ్వడం ఈ ఎత్తుగడలో మూడవ మెట్టు.

కార్మికుల దగ్గరికొచ్చేసరికి ఇంత కర్కశంగా వ్యవహరించే ఛైర్మన్ శర్మగారు యాజమాన్య సిబ్బంది పాల్పడే అవినీతి విషయంలో గానీ వారి జీతభత్యాల విషయంలోగానీ చాలా ఉదారంగా ఉండడం కార్మికులకతని పట్ల మూకుమ్మడిగా వ్యతిరేకత ఉండడానికి గల ముఖ్యకారణం. గడచిన రెండు సంవత్సరాలలో సింగరేణి అధికార్ల జీతభత్యాలు దాదాపు రెండింతలయ్యాయి.అవినీతి ఆరోపణలున్న అధికార్లందరూ ఏ ఆటంకం లేకుండ ప్రమోషన్లు పొందుతున్నారు.

కార్మికుల కోపానికిది కారణంకాగా, ఉత్తర తెలంగాణ గ్రామీణ యువకులకు ఛైర్మన్‌శర్మగారి పాలన శాపమయింది. వ్యవసాయం అసలే అంతంత మాత్రంగా ఉన్న ఉత్తర తెలంగాణ గ్రామాల నిరుద్యోగులకు లక్ష మందికి పైగా కార్మికులున్న సింగరేణి కొన్ని దశాబ్దాలుగా ఒక ఆశాదీపంగా ఉంది. శ్రమ ఎంతయినా ఉండనీగాక, 'బొగ్గు బావిలో పని' జీవితానికి భద్రతనిస్తుంది. మక్కలు, జొన్నలు పండించుకునే వ్యవసాయం ఇవ్వలేని భద్రతనిస్తుంది. అందుకే సింగరేణి యాజమాన్యం పెట్టే శారీరక పరీక్షను తట్టుకొని- ఎర్రటి మేనిలో 47 డిగ్రీల ఎండలో ఇరవై అయిదు నిముషాలలో అయిదు కి.మీలు పరుగెత్తడం- గని కార్మికులుగా పని సంపాదించుకోవాలని ఆరాటపడుతున్నారు.

ఆ అవకాశాన్ని క్రమక్రమంగా తగ్గించేస్తున్న ఛైర్మన్ శర్మగారి పాలన నుండి సింగరేణిని కాపాడుకోవడం తెలంగాణ యువతకు అవసరం. ఆ లక్ష్యంతో ఈ మధ్యనే ఏర్పడిన 'సేవ్ సింగరేణి కమిటీ' తన లక్ష్యాన్ని సాధించి తెలంగాణ యువత కోసం సింగరేణిని కాపాడడంలో కృతకృత్యమవుతుందని ఆశిద్దాం.



Copyright (C) 1999 Nihar Infoway Ltd. All rights reserved. See Disclaimer.